
జడ్చర్లలో జాతీయరహదారిపై..


నల్లచెరువు వద్ద చేపలు పట్టేవారి సందడి


అలుగు పారుతున్న నవాబుపేట, యన్మన్‌గండ్ల చెరువు


సాలార్‌నగర్ ప్రాజెక్టు


గుడి మల్కాపూర్ వాగు దాటేందుకు పాట్లు

- స్తంభించిన రాకపోకలు
- తెగిన కాల్వలు
- నీట మునిగిన పంటలు

# ముంచెత్తిన వాన

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా గ్రామాలను వర్షం ముంచెత్తింది. చెరువులు, చెక్‌డ్యాంలు అలుగు పారాయి. కాల్వలు తెగి పంటపొలాలు నీట మునిగాయి. ఆయా చోట్ల రాకపోకాలు స్తంభించాయి. ఇల్లు కూలిపోయాయి. దీంతో అధికారులు అప్రమత్తమై బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయని వివరించారు. మన్యంకొండ స్టేజీ నుంచి కోటకదిర గ్రామాల మధ్య వాగు పొంగి ప్రవహించడంతో కోటకదిర, పోతన్‌పల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

■ గండేడ్ పరిధిలో చెరువులు మత్తడి దుంకాయి.

■ కోయిల్‌కొండ పరిధిలో దమాయపల్లి గణపతి రాయుడు చెరువు అలుగుపారింది. ఆదివారం తెల్లవారుజామున కట్టకు పగుళ్లు ఏర్పడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కార్యదర్శుల బృందంతో కలిసి చెరువు కట్టకు గండి కొట్టించారు.

■ హన్వాడ పరిధిలో పలు చెరువులు మత్తడి దుంకాయి. ఎన్‌హెచ్–167ఎన్ వంతెనల వద్ద తాత్కాలికంగా వేసిన రోడ్లు వరదలో కొట్టుకుపోయాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీఓ నవీన్ తదితరులు మండలంలో పర్యటించారు. ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సైతం మండలంలో పర్యటించారు.


వరద నీటిలోనే గోల్ మసీదు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

■ నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాల మధ్య పెద్ద చెరువు రెండేళ్ల అనంతరం నిండిడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తాళ్లవాగు ఉధృతి వల్ల మండల కేంద్రానికి దాదాపు 4 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.

■ మహమ్మదాబాద్ పరిధిలో 167 జాతీయ రహదారి తెగిపోయింది. పోలీసులు రాకపోకలను నియంత్రించారు. చిన్నచింతకుంట పరిధిలో ఊకచెట్టు పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచాయి. అప్పంపల్లి సమీపంలో కుర్వశ్రీను పొలంవద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె మీద నుంచి కింద పడిపోయింది.

■ రాజాపూర్ పరిధిలో సెజ్‌లోని పరిశ్రమలు వదిలిన కాలుష్య జలాలతో పాటు వర్షంనీరు వరదలా రావడంతో పల్లె చెరువు నిండి ముదిరెడ్డిపల్లి శివారులోని రైల్వే అండర్‌పాస్ ద్వారా పెద్ద ఎత్తున వరద రావడంతో.. ఆదివారం సమీపగ్రామాలైన నందిగామ, క్రాంతినగర్, ఈర్లపల్లి, కోడ్గల్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

■ మిడ్జిల్ పరిధిలో కేజీబీవీ, ప్రభుత్వ ఆస్పత్రిలోకి వరద నీరు చేరి చెరువులను తలపించాయి. దుంధుభీ ఉధృతంగా ప్రవహించడంతో కొత్తూర్–వెలుగొమ్ముల మధ్యలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భూత్పూర్ మండల పరిధిలో కతాల్‌ఖాన్ చెరువు, ఊరచెరువు అలుగుపారాయి. మద్దిగట్లలో మద్దిఖాన్ చెరువుకు కేఎల్ఐ కాల్వ నీరు ఉధృతంగా రావడంతో నిండుకుండులా మారింది. చెరువు కట్ట తెగే పరిస్థితికి రావడంతో తహసీల్దార్ రాజు పరిశీలించారు. ప్రస్తుతం తూము ద్వారా నీటిని వదులుతున్నారు. పోతులమడుగు–గోపన్నపల్లి మధ్య కాజువేపై వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి.

## పొంగిపొర్లుతున్న పెద్దవాగు

మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు ఆదివారం వరద ఉప్పొంగింది. మూసాపేట మండలం పోల్కంపల్లి నుంచి కొప్పట వెళ్లే దారిలో వాగులో రాకపోకలు నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అడ్డాకుల మండలం గౌరిదేవిపల్లి, కొమిరెడ్డిపల్లి గ్రామాల మధ్యన వాగులో ఉన్న కాజ్‌వేపై వరద పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. జానంపేట గంగారం చెరువుకు వరద నీళ్లు వచ్చే కాలువ చెరువుకు కొంత దూరంలో తెగిపోయింది. దీనివల్ల వరి పంటలు నీట మునిగాయి.


బాధిత కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది


వేపూర్- రామన్నపల్లి మధ్య..


చిన్నచింతకుంట పరిధిలో ఊకచెట్టువాగు..


అప్పంపల్లిలో కిందపడిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


హన్వాడ- బుద్దారం మధ్య..


మిడ్జిల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..


కోటకదిర వద్ద కంప వేయించిన అధికారులు


ముదిరెడ్డిపల్లి- నందిగామ దారిలో..

## జలమయమైన జడ్చర్ల

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: ఎడతెరిపి లేని వర్షాలకు జడ్చర్ల జలమయమయ్యింది. మున్సిపాలిటీ పరిధిలోని ఊరచెరువు అలుగు పారుతోంది. పద్మావతి కాలనీ ఫేస్1 వరదనీటితో నిండిపోయింది. వరదనీటిలో అవస్థలు పడ్డారు. యాసాయికుంట కట్ట తెగటంతో పంట పొలాలు మునిగాయి. ఆల్వాన్‌పల్లి వాగు, నసురుల్లాబాద్ చెరువు అలుగుపారటంతో వరిచేలు మునిగాయి. ఆలయాల్లోకి నీరు చేరింది. కావేరమ్మపేట వద్ద ఉన్న నల్లచెరువు (మినిట్యాంక్‌బండ్) నిండి అలుగు పారుతుండటంతో ఆ నీరంతా 44వ నంబరు జాతీయరహదారిపైకి చేరింది. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జడ్చర్లలో ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బఫర్‌జోన్ నిబంధనలను ఉల్లంఘించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మినీట్యాంక్ బండ్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదను మళ్లించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటన సమయంలో మున్సిపల్ కమిషనర్ రాజయ్య, మరో ప్రాంతంలో ఓ వ్యక్తి నాలాలో పడిపోయారు. వెంటనే పక్కన ఉన్న వారు వారిని బయటకు లాగడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.


జడ్చర్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి


వేంకటేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన నీరు

## నీట మునిగిన పాలమూరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం నీట మునిగింది. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరుచేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. పిల్లలమర్రి అటవీ ప్రాంతం నుంచి ఆరంభమయ్యే చిక్కుడువాగు కాస్తా లక్ష్మీనగర్‌కాలనీ, బృందావన్ కాలనీ, శ్రీనివాస కాలనీల మీదుగా ఉధృతంగా పారింది. దొడ్డలోనిపల్లి సమీపంలోని గాండ్లోనిచెరువు నిండి పాటు కాల్వల ద్వారా స్టేషన్ ఏరియా, సద్దలగుండు, రాజేంద్రనగర్, న్యూటౌన్ తదితర ప్రాంతాలకు వరద పొంగి పొర్లింది.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు కాలనీల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి తో కలిసి కొత్త చెరువును పరిశీలించారు. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ఉన్నారు.

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు జలీల్ పాషా, వేదవ్రత్, రామలక్ష్మణ్ తదితరులు ఆయా ప్రాంతాల్లో స్వయంగా పర్యటించారు.


జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జలమయం


శ్రీనివాసకాలనీ వద్ద చిక్కుడువాగు

## వరద బాధితులకు సాయం అందించాలి


శ్రీనివాస కాలనీలో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో వరద ప్రాంతాల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం పర్యటించారు. శ్రీనివాసకాలనీలో కౌన్సిలర్ పటేల్ ప్రవీణ్‌తో కలిసి కొట్టుకుపోయిన ప్రధాన రోడ్డును పరిశీలించారు. నీట మునిగిన కాలనీ ప్రాంత ప్రజలతో మాట్లాడారు. బాధితులకు సాయం అందించాలని డిమాండ్ చేశారు.

**523 బాధితులకు భరోసా**

క్రిష్టియనల్ పల్లి ఆదర్శనగర్‌లోని 523 సర్వే నంబర్ ప్రాంతంలో ఆదివారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించారు. బాధితులను ఓదార్చారు. బాధితులకు అన్నం వడ్డించారు. దివ్యాంగులని కూడా చూడకుండా బయటకు పంపించి ఇళ్లను కూలగొట్టారని ఆరోపించారు. బాధితులు వర్షానికి తడుస్తున్నా పాలకులకు కనికరం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదన్నారు. తాను పేదలకు భోజనం పెట్టడం తప్పా? అంటూ ప్రశ్నించారు. బోగస్ పట్టాలని చెబుతున్న అధికారులు వాటిపై విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. పేదలకు న్యాయం చేసేవరకు పోరాటం సాగుతుందన్నారు.

## కురుస్తున్న గండేడ్ బీసీ హాస్టల్


హాస్టల్‌లో నీరు కారుతున్న చోట ఉంచిన బకెట్లు



గండేడ్: మండల కేంద్రంలో బీసీ హాస్టల్ గదులు రెండు రోజులుగా వర్షాల కారణంగా కురుస్తున్నాయి. దీంతో విద్యార్థులకు కంటిమీద కునుకు కరువైంది. చేసేదిలేక నీరు కారుతున్న చోట బకెట్లు పెట్టారు. కొంతమంది విద్యార్థులు భయంతో ఇళ్లకు వెళ్లిపోయారు. అక్కడే ఉన్నవారు బిక్కుబిక్కు మంటూ గడిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగలక్ష్మి ఆదివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి పాఠశాలలోకి వెళ్లమని సూచించారు. హెచ్ఎంతో కలిసి విద్యార్థులు రాత్రికి పడుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉన్నతాధికారులకు విషయం తెలిపారు. కాగా జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర ఆదివారం సాయంత్రం హాస్టల్‌ను సందర్శించారు. తహసీల్దార్ కేటాయించిన పాఠశాల గదుల తాళాలు తీయించారు. భోజనం చేసిన తర్వాత రాత్రి విద్యార్థులు అక్కడ పడుకోబెట్టాలని వార్డెన్ కృష్ణను ఆదేశించారు.



## పర్యాటకుల తాకిడి

కోయిల్‌సాగర్ జలాశయం వద్ద ఆదివారం 11 గేట్లు తెరిచి నీటిని దిగువకు వదిలారు. దీంతో చుట్టుపక్కల గ్రామాలతోపాటు మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. ప్రాజెక్టు కట్టపై, గేట్ల దిగువన పెద్ద సంఖ్యలో చేరుకుని సందడి చేశారు. పోలీసులు, ఇతర అధికారులు అక్కడికి చేరుకుని ప్రమాదకర ప్రాంతాలకు ఎవరూ వెళ్లకుండా సూచనలు చేశారు.

– దేవరకద్ర/ కోయిల్‌కొండ



## ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు బెక్కరి అనితను ఆదివారం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సాలే మహ్మద్ తదితరులు ఘనంగా సన్మానించారు. న్యూటౌన్‌లోని తమ నివాసాలకు ఆహ్వానించి మాజీ కౌన్సిలర్ ఫాతిమున్నిసాబేగం, నాయకుడు మహ్మద్ ఇమ్రాన్ శాలువాలు, పూలమాలతో సత్కరించారు.

## ఆత్మీయ సమ్మేళనం



కోయిల్‌కొండ: మణికొండ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు(2012–13) ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులందరిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సాయినాథ్, రహమాన్, బాలనారాయణ, శంకరచారి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### లోతట్టు ప్రాంతాల్లో బీజేపీ నేతల పర్యటన

పాలమూరు: జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాములు తదితరులు పర్యటించారు. కురిహిని శెట్టి కాలనీకి శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. ఏటా వర్షాకాలంలో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యపై దృష్టిపెట్టాలన్నారు.

### దుప్పట్లు అందజేత



నవాబుపేట: యన్మన్‌గండ్ల బాలికల కళాశాల వసతి గృహాన్ని ఇటీవల తహసీల్దార్ నాన్యనాయక్ జిల్లా అధికారుల ఆదేశాలతో తనిఖీ చేశారు. కాగా అక్కడ సరైన వసతులు లేకపోవటం చలించిపోయారు. ఈ మేరకు దుప్పట్లు, దోమల నివారణ పరికరాలు తదితర సామగ్రి ఆదివారం అందించారు. వసతుల కలెక్టర్‌కు ప్రత్యేక నివేదిక అందించినట్లు వివరించారు.

### యువకుడికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడికి రోడ్డు ప్రమాదంలో తలకు గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. మండల పరిధిలోని జేపీఎన్‌సీఈ కళాశాల ఎదుట ఆదివారం రాత్రి అప్పాయిపల్లికి చెందిన చందు ద్విచక్ర వాహనంపై వెళ్తుంటే రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

## భక్తిశ్రద్ధలతో కోట మైసమ్మ బోనాలు


ఉడిత్యాలలో పలారం బండి ఊరేగింపు

రాజాపూర్(బాలానగర్): ఉడిత్యాలలో ఆదివారం కోటమైసమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుల్‌జీన్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో పలారం బండి కార్యక్రమం చేపట్టారు. డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, చక్కెర సత్యనారాయణగౌడ్, సుభాష్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మల్లేష్‌గౌడ్, సాయిధర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఉట్ల మహోత్సవం


మన్యంకొండలో ఉట్లు కొడుతున్న యువకులు

మహబూబ్‌నగర్ రూరల్ : మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం అర్ధరాత్రి ఉట్ల మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్ల మహోత్సవంలో ఓబ్లాయపల్లి గ్రామానికి చెందిన భక్తులు పాల్గొని ఉట్లు కొట్టారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి స్వామివారి ఉట్ల మహోత్సవంలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు మన్యంకొండకు తరలివచ్చారు. అలాగే స్వామివారి శేషవాహన సేవ వైభవంగా జరిగింది. వివిధ రకాల బంగారు ఆభరణాలు, రకరకాల పూలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో కాగడాల వెలుతురు, విద్యుత్ లైట్ల మధ్య స్వామివారు బంగారు అభరణాల అలంకరణలో ధగధగ మెరిసిపోతూ భక్తకోటికి దర్శనమిచ్చారు.

జడ్చర్ల: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జడ్చర్ల పట్టణంలో శ్రీ కృష్ణుడి ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు భగవద్గీత పారాయణం చేశారు. పోలేపల్లిలో స్వామి వారి ఊరేగింపు చేపట్టారు. ఉత్సవ నిర్వాహకులు నాగ్యానాయక్, వెంకటేశ్, రాఘవేంద్ర, భాస్కర్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## బాధితులను ఆదుకోవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భారీ వర్షాల వల్ల ఉమ్మడి జిల్లాలో నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు కురుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇళ్లలోకి నీరు రావడంతో ఆహార వస్తువులు, ధాన్యం తడిసిపోవడంతో చాలామంది అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లే గోపాల్ పాల్గొన్నారు.

## పరుశవేదీశ్వరుడికి లక్ష బిల్వార్చన



జడ్చర్ల టౌన్: మీనాంబరం పరుశవేదీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఆదివారం మాస శివరాత్రి పురస్కరించుకుని స్వామికి లక్ష బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవచానంతో ప్రారంభమైన కార్యక్రమం భక్తుల శివనామస్మరణల మధ్య కొనసాగింది. సాయంత్రం రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిపించారు. అర్ధరాత్రి పల్లకీసేవతో వేడుకలు ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. దుందుభీనది నీటితో శివుడికి అభిషేకం చేశారు.

## సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే..


తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘా నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి.. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీజేఏసీ స్టీరింగ్ కమిటీ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు రాజ్‌గోపాల్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నల్ల డ్రస్సులు, నల్లబ్యాడ్జీలతో వర్షంలోనూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని, పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, సీపీఎస్ పేరును మార్చి యూపీఎస్ పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్త మోసానికి తెరతీసిందని ఆరోపించారు. ఇది ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించడమే ఉద్యోగుల ఏకైక లక్ష్యం అన్నారు. లేకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఒక్కతాటిపైకి వచ్చి ప్రభుత్వాలపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించిందని, వెంటనే దాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చంద్రనాయక్, నరేందర్, వెంకటేశ్వర్లు, నారాయణగౌడ్, రఘురాంరెడ్డి, వెంకటేష్, రవికుమార్, కిష్టయ్య, వెంకటేష్, ఆదిత్య వెంకటేశ్వర్లు, నారాయణ, బాలశంకర్, శ్రీరాములు, రామకృష్ణ, చంద్రకాంత్, ఉమాదేవి, జయంతి, దివ్యప్రియాంక, శైలజ, రామదాసు, సాయిలుగౌడ్, అంజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణమోహన్, వెంకట్‌రాంరెడ్డి, కృష్ణకాంత్, నందకిషోర్, మహేశ్వర్‌రెడ్డి, కృష్ణకుమార్, గంగారం తదితరులు పాల్గొన్నారు.